నేడు డయల్ యువర్ డీఎం

మూసాపేట: కూకట్‌పల్లి డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ హరి తెలిపారు. బస్ బే, బస్సుల రాకపోకలు వంటి సమస్యలను పరిష్కరించడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఫోన్ 9959226151 నెంబర్‌లో ఫోన్ చేసి సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆలయానికి మైక్ సెట్ అందజేత



అల్విన్‌కాలనీ: జగద్గిరిగుట్ట, రామకృష్ణ నగర్, పోచమ్మ ఆలయంలో మైక్ సెట్‌ని వేంకటేశ్వర నగర్‌కు చెందిన పర్వత్ సతీష్ కుమార్, సంధ్యారాణి దంపతుల కూతురు పర్వత నిఖిల మానస పటేల్ జన్మదినం సందర్భంగా గురవారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ కొత్వాల్ మధు, ప్రధాన కార్యదర్శి గిరి మధుసూదన్, కోశాధికారి తలారి రాజు, లద్దిపీర్ల రవికాంత్ గౌడ్, బత్తుల రాంనర్సయ్య, చంద్రశేఖర్, డీజే నవీన్, సుంకరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



బాలానగర్: గీతానగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఉపేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా జి. కాళిదాస్, కోశాధికారిగా ఎం. కిషోర్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వై. ఆంజనేయ రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా వి.దేవరాజ్, జి.బాలరాజ్, జి. రఘురామిరెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ 2వ రోడ్డులోని ప్రభుత్వ మండల అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మెగా సిటీ ఆధ్వర్యంలో వాటర్‌ఫిల్టర్‌ను అందజేశారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ముమ్మారెడ్డి ప్రేమకుమార్ హాజరయ్యారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మెగా సిటీ డిస్ట్రిక్ట్ 320 ఏ గవర్నర్ డి. కోటేశ్వరరావు, వి. సత్యనారాయణరావు, ఎం. అనిల్ కుమార్, సభ్యుల ద్వారా వాటర్ ఫిల్టర్ అందజేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కలిగినిడి ప్రసాద్, సుంకర సాయి, అంజి, విస్సు, పాపారాయుడు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వీ టీమ్ ఆధ్వర్యంలో కర్రపూజ



మోతీనగర్: వీ టీమ్ వరసిద్ధి వినాయక సేవా సమితి నిర్వహించనున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలకు గురువారం అంకురార్పణ చేశారు. రోడ్డు నంబర్ 9 వివేకానందనగర్‌లో వీ టీమ్ ప్రెసిడెంట్ దేవరింటి మస్తాన్ రెడ్డి ఆధ్వర్యంలో కర్ర పూజ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రవీందర్, చెల్లయ్య, ఆదినారాయణ, సతీష్ రెడ్డి, ఆగతమూడి రమేష్, సుబ్బయ్య చౌదరి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి రుద్రాక్షలతో అలంకరణ



రాయదుర్గం: శ్రావణమాస శివరాత్రిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అర్చకుల పర్యవేక్షణలో ఆలయంలోని కాశీవిశ్వేశ్వరస్వామి వారికి ప్రత్యేక అర్చనలు, పూజలు, అభిషేకాలు చేసి రుద్రాక్షలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంతేకాకుండా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో గణేశుడు, అన్నపూర్ణాదేవి, షిర్డీసాయిబాబా, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలను చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రజలకు ఉపయోగపడేలా చెరువుల సుందరీకరణ

- వరదముంపు లేకుండా చేయడమే లక్ష్యం
- మరో 13 చెరువులను అభివృద్ధి చేస్తాం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్



ఐడీఎల్ చెరువును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

కూకట్‌పల్లి: ప్రజలకు ఉపయోగపడేలా చెరువుల సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు కట్ట ప్రాంతాన్ని, కూకట్‌పల్లి నల్ల చెరువును గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ఆరా తీశారు. వినాయక నిమజ్జనంపై అధికారులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కూకట్‌పల్లిలోని నల్ల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్ల చెరువును ఎంతో అభివృద్ధి చేశామని అన్నారు. చుట్టు పక్కల కాల్వల నుంచి నీరు చెరువులోకి వచ్చిన తరువాత బయటకు వెళ్లేందుకు మరోక అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో కొన్ని సంవత్సరాల తరువాత వరద ముంపు లేకుండా తయారు చేయటమే హైడ్రా లక్ష్యమని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా చెరువులను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. కమ్యూనిటి హాల్స్, వాకింగ్ ట్రాక్స్, పిల్లలు ఆడుకునే విధంగా ఏర్పాట్లు, చిన్న చిన్న శుభ కార్యాలు చేసుకోవడానికి వీలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆరు చెరువులను ప్రస్తుతం అభివృద్ధి చేస్తున్నామని, మరో 13 చెరువులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆదాయం వచ్చినా అభివృద్ధికి కేటాయించరా?

- హౌసింగ్ బోర్డు స్థలాల్లో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి
- భూములను అమ్మి సొమ్ము చేసుకోవడమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు భూములు అమ్ముకుని వందల కోట్లు సొమ్ము చేసుకుంటున్న ప్రభుత్వం కూకట్‌పల్లి అభివృద్ధికి మాత్రం ఒక్క పైసా నిధులు కూడా కేటాయించటం లేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. హౌసింగ్ బోర్డు భూములను అమ్మడం ద్వారా ఐదు వేల కోట్ల రూపాయలు సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. హౌసింగ్ బోర్డు భూములను అమ్ముకోవటం అక్రమమని, హౌసింగ్ బోర్డు ఏర్పడింది ఇల్లు లేని పేదలకు ఇల్లు కట్టించి ఇచ్చే లక్ష్యంతో మాత్రమేనన్నారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు భూములను అమ్మడం ద్వారా వచ్చే ఆదాయంతో కూకట్‌పల్లి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు నూతనంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జీలు, రైల్వే అండర్ పాస్‌లు నిర్మించాలని డిమాండ్ చేశారు. హౌసింగ్ బోర్డు భూములను పార్కులు, ఆట స్థలాల కోసం కేటాయించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం భూములను అమ్ముకుని సొమ్ము చేసుకోవడం ద్వారానే నడుస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి వల్లే హౌసింగ్ బోర్డు భూముల ధరలు పలికాయని అన్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం భూములను అమ్మడం ద్వారా వచ్చే ఆదాయాన్ని కూకట్‌పల్లితో పాటు హైదరాబాద్ అభివృద్ధి పనులకు వినియోగించాలని డిమాండ్ చేశారు.

డ్రైనేజీని పరిశీలించిన కార్పొరేటర్



పొంగిపొర్లుతున్న డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

అల్విన్‌కాలనీ: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో అల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ పరిధిలోని మహంకాళి నగర్ కాలనీలో డ్రైనేజీ పొంగి వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. కాలనీ వాసులు విషయాన్ని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన గురువారం పర్యటించి పరిశీలించారు. కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరును వెంటనే తొలగింపచేయాలని జలమండలి అధికారులకు సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా, వెంటనే సంబంధిత అదికారులకు గాని, తమకు గాని తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో నాగరాజు, దాతి రమేష్, నిరంజన్, షౌకత్ అలీ మున్నా, గురునాథ్, కాశప్ప, కాంతప్ప, విజయ్, రాకేష్, హీరాలాల్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నేడు కృత్రిమ ఉపకరణాల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ అలింకో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులను గుర్తించి, వారికి అవసరమయ్యే ఉపకరణాలను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా పంపిణీ చేయనున్నారు. గురువారం ఐఈఆర్‌పీ దేదీప్య మాట్లాడుతూ కూకట్‌పల్లి పరిధిలో ఎవరైనా దివ్యాంగ విద్యార్థులు ఉంటే వారిని గుర్తించి అలింకో సంస్థ వారు, వారికి అనవరమైనటువంటి పరికరాలు అందజేస్తారన్నారు. శుక్రవారం బహదూర్‌పల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించే కార్యక్రమంలో పరికరాలు పంపిణీ జరుగుతుందని తెలిపారు.

వరద సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలి

కార్పొరేటర్ సబిహాబేగం



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: వరద సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. వర్షాల నేపథ్యంలో గురువారం సఫ్దార్ నగర్ ఏ బ్లాక్, రాజీవ్ గాంధీ నగర్ సీ బ్లాక్‌లో నాలా పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సఫ్దార్ నగర్ ఏ బ్లాక్, రాజీవ్ గాంధీ నగర్ సి బ్లాక్‌లోని లోతట్టు ప్రాంతాల ప్రజల ఫిర్యాదుల మేరకు తక్షణమే డ్రైనేజీ నీటి నిల్వలు తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ హమీద్, రామ్ బాబు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ పూజలు



ఓల్డ్‌బోయిన్‌పల్లి: భవానీ నగర్ శ్రీదుర్గా భవాని మాత ఆలయ 13 వార్షికోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం కళశపూజ, గణపతి హోమం, చండీ హోమం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం సామూహిక బోనాల కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కర్రె జంగయ్య, డివిజన్ సెక్రటరీ మేకల హరినాథ్, మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి, రాజు గౌడ్, సాయిలు, సతీష్, లలిత, ఈశ్వరమ్మ, అర్చన, సునంద, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం ద్వార విద్యా విస్తరణ

రాయదుర్గం: ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా విద్యను విస్తరించడానికి కొత్త మల్టీమీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పద్మశ్రీ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఉర్దూ మాట్లాడే విద్యార్థుల ఇంగ్లీష్ కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా మదర్సా కనెక్ట్ కార్యక్రమాన్ని 'మనూ'-షహీన్ గ్రూప్ ప్రధాన స్రవంతితో కలిసి గురువారం ఆయన క్యాంపస్‌లోని సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో ప్రారంభించారు. మదర్సాలు ఈ కార్యక్రమంలో చేరాలని కోరారు. అంతర్జాతీయ విద్యకు మార్గాలను తెరవడంలో దాని పాత్రను నొక్కి చెప్పారు.

ఆలయ ప్రహరీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్‌బోయిన్‌పల్లిలోని ఛత్రిగడ్డలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో గురువారం కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ సాంబ శివాలయ ప్రహరీ గోడ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి, రాకేష్, మోహన్, మధు, నాగేందర్, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

ఆహారం అందజేత

అల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ జన్మదినం సందర్భంగా గురువారం బంజారాహిల్స్‌లోని బసవ తారకం కేన్సర్ హాస్పిటల్ ప్రాంగణంలో కేన్సర్ వ్యాధి బాధితులకు, వారి సహాయకులకు ఆహారం అందించారు. తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అశ్వంత్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.జోగు కిరణ్, కట్ట శ్రీనివాస్, వై. రాజు, దుర్గప్రసాద్, మణికంఠ, వెంకట్, బబ్లు, భరత్, లోకేష్, చందు, రవి పాల్గొన్నారు.



ఆహారం ప్యాకెట్లు అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర సెక్రటరీ అశ్వంత్ కుమార్ తదితరులు

పనుల పూర్తికి నిధులు మంజూరు చేయాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శోభన కాలనీని ఆనుకుని ఉన్న రజక సంఘం దోబీ ఘాట్ పనుల పూర్తికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కంచి భిక్షపతి, రజక సంఘం నాయకులు బాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో భక్తి శ్రద్ధలతో బోనాలు

సాక్షి మేడ్చల్ జిల్లా: జిల్లా తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ (టీఎన్జీఓస్) జిల్లా అధ్యక్షుడు రవిప్రకాశ్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు కలెక్టరేట్లో అట్టహాసంగా జరిగాయి. గురువారం పోతరాజుల ఊరేగింపులు, డప్పు చప్పుళ్ల, కళాకారుల విన్యాసాలతో ఉద్యోగులంతా కలసికట్టుగా పాల్గొని పండుగకు ప్రత్యేక శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా టీఎన్జీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు, టీజాక్ చైర్మన్ మారాం జగదీశ్వర్ ఉద్యోగుల సంక్షేమం కోసం స్వయంగా బోనం ఎత్తి అమ్మవారికి సమర్పించారు.రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు పెద్దసంఖ్యలో హాజరై ఉద్యోగ సంఘాల ఐక్యతను ప్రదర్శించారు. తెలంగాణ ప్రత్యేకతను చాటే బోనాల పండుగను ఉద్యోగ సంఘాలు సాంప్రదాయబద్ధంగా జరుపుకోవడం, ఉద్యోగుల ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. టీఎన్జీఓస్ నాయకులు కస్తూరి వేంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, లక్ష్మణ్, భరత్కుమార్, శామ్యూల్‌పాల్, శేషసాయి గిరికాంత్, రవిచంద్రన్, నాగరాజ్, అశ్విని, రూప, సుధీర్‌కుమార్, కొండల్‌రావు, వినయ్‌కాంత్, సజీద్, నజీమా, కార్తీక్, లింగాల అక్షయ్, ఉమాకాంత్ , శ్రీనివాస్, అరుణ , సత్యజ్యోతి, భాస్కర్, మాణిక్యం పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి



జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే

వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే

గచ్చిబౌలి: గణేష్ ఉత్సవాలతో పాటు నిమజ్జనానికి అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే సూచించారు. శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ పరిధిలో గణేష్ ఉత్సవ కమిటీ వారితో జోన్ పరిధిలోని అధికారులతో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాల కోసం ముందస్తు పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలని, ఎలాంటి పొరపాట్లు అసౌకర్యాలకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. వెస్ట్‌జోన్ పరిధిలోని మల్కంచెరువు, గోపిచెరువు, నల్లగండ్ల చెరువు, రాయసముద్రం, సాకిచెరువు, గంగారం చెరువు, గౌతమ్ బేబీపాండ్, కడియంకుంట, దుర్గంచెరువు వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధాన, అంతర్గత రహదారులను శుభ్రం చేయాలని కోరారు. అన్ని విభాగాల మధ్య ఎలాంటి సమస్యలు రాకుండా సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి నిర్వహించాలని సూచించారు. వినాయక ప్రతిమల నిమజ్జనానికి బేబీ పాండ్లకు కూడా సిద్ధం చేయాలని, వాటిలో పేరుకుపోయిన వ్యర్థాలను ముందస్తుగా తొలగించి సిద్ధం చేయాలని సూచించారు. శోభాయాత్రలు జరిగే ప్రాంతాలలో రహదారులను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని సూచించారు. పాండ్ల వద్ద విద్యుత్ దీపాలు, శానిటేషన్ సహా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. చెరువుల పరిరక్షణకు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని చోట్ల ఫాగింగ్ చేయాలని ఎంటమాలజీ విభాగాన్ని ఆదేశించారు. పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక ఎంటమాలజీ విభాగాలతో పాటు ఆయా విభాగాల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు సహకరించాలి

నిజాంపేట్: గణేష్ నవరాత్రి ఉత్సవాల విజయవంతానికి సహకరించాలని ఉత్సవ సమితి కార్పొరేషన్ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం సీఐ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆన్‌లైన్‌లో పర్మిషన్లు అడిగేవారికి పర్మిషన్లు ఇవ్వాలని కోరారు. దానికి సీఐ సతీష్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ గణేష్ నవరాత్రులను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు చేపట్టే తనిఖీలకు సహకరించాలన్నారు. మండపాల నిర్వహణకు పోలీస్‌శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భిక్షపతి యాదవ్, ప్రసాద్ రాజు, సుమన్‌రావు, సచిన్, త్రినాథ్, భూపాల్, సురేష్, సంతోష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గో బ్యాక్ మార్వాడీ నినాదం సరికాదు

నిజాంపేట్: గో బ్యాక్ మార్వాడీ నినాదం సరికాదని పలువురు అన్నారు. గురువారం ప్రగతినగర్‌లో మార్వాడీలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో ఎక్కడైనా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. ఎవరో ఒకరిద్దరు చేసిన తప్పులకు ఒక సామాజికవర్గం మొత్తాన్ని నిందించడం తగదన్నారు. మన రాష్ట్రం నుంచి ఎంతోమంది వివిధ రాష్ట్రాల్లో, దేశాల్లో విద్య, ఉద్యోగం, వ్యాపారాల్లో ఉన్నారని అన్నారు. వారిని కూడా దృష్టిలో పెట్టుకుని మాట్లాడాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ ఎమ్.ఆర్.ఎస్.రాజు, రచ్చ చక్రధర్, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మీ సుబ్బారావు, దాసి నాగరాజు, బాబు చౌదరి, శరవణ్‌లాల్, సూరజ్, భరత్ పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

అహ్మద్‌గూడ డబుల్ బెడ్రూం కాలనీలో కలెక్టర్ మను చౌదరి పర్యటన



కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడ డబుల్ బెడ్రూం కాలనీలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూంలో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. విద్యుత్ ఫ్లక్చువేషన్, ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెతో భద్రత, ట్రాన్స్‌ఫార్మర్లను వేరేచోటుకి మార్చడం వంటి సమస్యలు వెంటనే పరిష్కరిస్తామన్నారు.

అభివృద్ధి పనులకు చర్యలు..

వరద నీరు వెళ్లేందుకు పైపులైన్లకు మరమ్మతులు, ఇళ్లలో గోడలు బీటలు వారి నీరు కారడం వంటి సమస్యలు, లిఫ్ట్ మరమ్మత్తులు చేయించడంతో పాటు సెల్లార్‌లోకి నీటి వల్ల ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలు ఆడుకోవడానికి పార్కు, ఆటవస్తువులు సమకూర్చడమే కాకుండా పార్కు పక్కనే ఉన్న సంపునకు ప్రహరీ ఏర్పాటు చేస్తామన్నారు.

- స్కూల్, బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయడానికి పరిశీలిస్తామని, ఆధ్యాత్మికత పెంపొందేలా పలుచోట్ల మందిరం, మసీద్, చర్చి నిర్మించిస్తామని చెప్పారు.



- రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకుని ఎన్నికలు నిర్వహించి కొంతమందిని ఎన్నుకుని వారి ద్వారా ప్రస్తుత సమస్యలు కాకుండా భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లా హౌజింగ్ అధికారి రమణమూర్తి, కీసర తహసీల్దార్ అశోక్, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి రెవెన్యూ డివిజన్స్‌లో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించి కమిషనర్ సాబేర్ అలీకి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బి.వెంకటరామయ్య మాట్లాడుతూ.. ప్రగతినగర్ 3వ డివిజన్ పరిధిలో మంచినీరు సమస్యను, ప్రగతినగర్‌లో బస్ షెల్టర్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. రాజీవ్ గృహకల్పలో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అంబేద్కర్ కాలనీ శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంతోష్, ఎం.చంద్రశేఖర్, బాల వెంకటేశ్వరరావు, ఎస్.బాలాపీరు, వెంకటేశ్వరరావు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.